క్లుప్తంగా

మార్మోగిన శివనామస్మరణ



సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. హరనామస్మరణ మార్మోగింది. భక్తులు స్వామిని బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహిత్ అలంకారి సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కల్యాణం నిర్వహించారు.

సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం



ముత్యాలమ్మపాలెంలో ప్రచారం చేస్తున్న నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు కోరారు. సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ముత్యాలమ్మపాలెం గ్రామంలో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను స్వయంగా కలిసి వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్,ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, మాజీ ఎంపీటీసీ అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీల విజేతకు అభినందన



నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ప్రతినిధులతో విజేతలు

పరవాడ: నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతిగ్లోబల్ పాఠశాల విద్యార్థి ఎన్.సుందరరామిరెడ్డి విశేష ప్రతిభ కనబర్చారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి చెప్పారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుందర్రామిరెడ్డి ఎయిర్ ఇండియా వెపన్ ఆల్ ఇండియా ఓపెన్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించినట్టు తెలిపారు. పాఠశాలలో సోమవారం రైఫిల్ షూటింగ్ పోటీల్లో సత్తాచూపిన సుందరరామిరెడ్డిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

అమ్మవార్ల పండగకు వేళాయె

- నాలుగు గ్రామాల్లో సందడి



దేశపాత్రునిపాలెం పోలమాంబ ఆలయం



దేశపాత్రునిపాలెం పోలమాంబ అమ్మవారు



పరవాడ పైడిమాంబ అమ్మవారు



అలంకరణలో ముత్యమాంబ అమ్మవారు

పరవాడ: నాయుడుపాలెం, పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మంగళవారం ఆయా గ్రామాల్లో అమ్మవార్ల పండగను వైభవంగా నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఆలయాలతో పాటు పురవీధులు విద్యుత్ తోరణాలతో కాంతులీనుతున్నాయి.ముత్యమాంబ, పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ గ్రామ దేవతలు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లులుగా ఆయా గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో కొలుస్తారు. మంగళవారం వేకువ జాము నుంచి గ్రామ దేవతలను దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పిస్తారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆలయాల ముందు ప్రత్యేక షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రికి గ్రామ దేవతలను డప్పు వాయిద్యాలు, చిడతలు, తప్పెటగుళ్లు, నేల డ్యాన్సులు వంటి సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామాల్లోని పుర వీధుల్లో ఊరేగిస్తారు. అనంతరం భారీ బాణ సంచాకాల్పుల నడుమ గ్రామ దేవతలను అనుపమహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భారీ పోలీసు బందో బస్తు ఏర్పాటు చేశామని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు.

సీతంరాజు విజయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాట



అడవివరంలోని బీసీ గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గొల్లనారాయణపురంలో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఉపాధ్యాయులను కోరారు. 98వవార్డు పరిధి అడవివరంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో నాన్ టీచింగ్ స్టాఫ్‌ను, అడవివరం జిల్లాపరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులను సోమవారం ఆయా పాఠశాలల్లో ముత్తంశెట్టి కలిశారు. .

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. అలాంటి ముఖ్యమంత్రి నిలబెట్టిన సీతంరాజు సుధాకర్‌కు అందరూ మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీని కానుకగా ఇవ్వాలన్నారు. సుధాకర్ విజయం ఉత్తరాంధ్ర ప్రగతికి బాటలు వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.సత్యారావు, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, 98వవార్డు వైఎస్సార్‌సీపీఅధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ నాయకులు ఎర్ర వరహా నరసింహం, పీతల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజుకు పట్టం కట్టండి

ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పట్టభద్రులను కోరారు. 93వవార్డు గొల్లనారాయణపురంలో సోమవారం ఆయన పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి బ్యాలెట్ నమూనా చూపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 93వవార్డు అధ్యక్షుడు దాసరి రాజు, నాయకులు అద్దాల రామరాజు, వినోద్, పీతల విష్ణుమూర్తి పాల్గొన్నారు.



గౌతమ్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదిరెడ్డి మురళి

- 94వవార్డు పరిధి గౌతమ్‌నగర్‌లో సోమవారం వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూరిశెట్టి సూరిబాబు, సచివాలయ కన్వీనర్ కనకరాజు పాల్గొన్నారు.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. గొల్లవిల్లిపాలెం, సాయిసాధానగర్ ప్రాంతాల్లో సోమవారం ఆయన పట్టభద్రులను కలిశారు కార్యక్రమంలో కె. సంతోష్, చెల్లారావు, వాసు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ మహిళా నాయకురాలు దెడ్డం పద్మావతి కోరారు. సబ్బవరం సాయినగర్ కాలనీ, దుర్గానగర్ కాలనీలలో సోమవారం పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు.

మేధోశక్తిని మెరుగుపరుచుకోవడం తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ మేధోశక్తిని నిరంతరం మెరుగుపరుచుకోవడం తప్పనిసరని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఉదయం ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఉన్నత విద్యా మండలి నిర్వహించిన జోనల్ స్థాయి క్విజ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తికి పరీక్షగా క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనలకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ, కాలాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ పోటీ పడాలన్నారు. కార్యక్రమ అధ్యక్షుడు ఆచార్య ఎ.నాగహనుమాన్ మాట్లాడుతూ 40 గ్రూపులుగా 80 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారన్నారు. విద్యార్థులకు వర్సిటీ ప్రాంగణంలో వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. ఉన్నత విద్యా మండలి అధికారి ఎ.ఆర్.నగేష్ మాట్లాడుతూ మూడు రీజియన్‌లుగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వీటిలో విజేతలకు రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ శ్రీధర్, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన రాజు(ఫైల్)

సింహాచలం: సింహాచలం నుంచి గోపాలపట్నం వెళ్లే ప్రధాన రహదారిలో శ్రీనివాస్‌నగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. జీవీఎంసీ 93వవార్డు ప్రహ్లాదపురంలో నివసిస్తున్న కంబాల రాజు(39) రాడ్ బెండింగ్ వర్కు చేస్తున్నాడు. సింహాచలంని గోశాల వద్ద పనికి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. శ్రీనివాస్ నగర్ సమీపంలో ఉన్న కారు వాషింగ్ వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో నాగరాజు కిందపడిపోయాడు. బస్సు వెనుక చక్రాలు తలపై నుంచి వెళ్లిపోవడంతో రాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పెందుర్తి లాఅండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. రాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మూల్యాంకన కేంద్రం పరిశీలన



మూల్యాంకనను పరిశీలిస్తున్న రెక్టార్ సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రశ్నాపత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఉదయం సందర్శించారు. బీఈడీ మూడో సెమిస్టర్ ప్రశ్నపత్రాల మూల్యాంకనం జరుగుతున్న విధానాన్ని ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.

గ్రూపు-2పై 9న అవగాహన సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శిక్షణ కేంద్రం ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీపీఎస్సీ గ్రూప్–2 అభ్యర్థులకు ఈ నెల 9న ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నామని అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యు, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను సోమవారం మద్దిలపాలెంలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గ్రూప్–2 పరీక్ష విధానంపై మధ్యాహ్నం 2.30 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి కె.సంతోష్, ఐ.రఘు పాల్గొన్నారు.

సమన్వయంతో పథకాల అమలు



శిక్షణకు హాజరైన అధికారులతో ఐఐఎం సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్

ఏయూ క్యాంపస్: ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఎంతో అవసరమని కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నంలో డిజిటల్ గవర్నెన్స్–మేనేజ్‌మెంట్ అంశంపై ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ఐదు రోజుల స్వల్పకాలిక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పూర్వ కార్యదర్శి అజయ్ ప్రకాష్ షానోయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సాధారణ పౌరుడికి విభిన్న సేవలను సాంకేతిక విధానాలు ఏ విధంగా చేరువ చేస్తున్నాయో వివరించారు. ప్రపంచానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించే సామర్థ్యం భారత్‌కు ఉందని స్పష్టమైందన్నారు. పారదర్శకతను పెంపొందించడానికి డిజిటల్ మౌలిక వసతులు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. ఐఐఎం విశాఖపట్నం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నిపుణులు ఐఐఎం వీ అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య నీన పాండే, ఆచార్య శ్రీనివాస్ జోస్యుల తదితరులు పాల్గొన్నారు.

లీగల్ కౌన్సిల్ సేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ: జైల్‌లో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సూచించారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఇక్కడ మహిళా ఖైదీలు ఉండే బేరక్‌లను పరిశీలించారు. వారికి అందుతున్న ఆహారం, వసతి, తాగునీరు, వైద్యం తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం మహిళా ఖైదీలకు న్యాయపరమైన విషయాలపై అవగాహన కల్పించారు. న్యాయ సంబంధమైన సమస్యలను సంస్థ ద్వారా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఫార్మా రంగంలో మహిళా వికాసం

- రాంకీ ఎండీ లాల్‌కృష్ణ
- ఘనంగా మహిళా దినోత్సవాలు ఆరంభం



మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న మహిళ స్టడీస్ డైరెక్టర్ ఉషా, రాంకీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ రాంకీ కమర్షియల్ హబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను సోమవారం ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ సోమవారం ప్రారంభించారు. తొలి రోజు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. మహిళలు ఫార్మా రంగంలో కూడా దూసుకుపోతున్నారన్నారు. విశాఖ ఫార్మాసిటీలో సుమారు 9 వేల మంది మహిళలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరు కోవిడ్ సమయంలో కనబర్చిన సేవలు అమోఘమని ఎండీ లాల్‌కృష్ణ ప్రశంసించారు. సెంటర్ ఫర్ మహిళా స్టడీస్ డైరెక్టర్ ఉషా మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో కూడా మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ వేధింపులను ధైర్యంగా ఎదుర్కోవడానికి మహిళలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జెనిత్ ఇంజినీరింగ్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వి.సంధ్య మాట్లాడుతూ మహిళలు భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫార్మా పరిశ్రమలో విశేష ప్రతిభ కనబర్చిన పలువురు మహిళలను సత్కరించి రాంకీ మహిళా సాధికారిత పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, శ్రీనివాస్, మ్యాక్స్ అధ్యక్షురాలు రాజేశ్వరి, ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనులకు గోవుల అందజేత



అధికారుల సమక్షంలో గోసంపదను అప్పగిస్తున్న దేవస్థానం అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పలువురి గిరిజనులకు సింహాచలం దేవస్థానం గోశాలలోని దేశవాళీ గోవులను సోమవారం దేవస్థానం అధికారులు అందజేశారు. పెదబయలు మండలంలోని ఇంజరి, దమదంగి, కొత్తూరు, కింతలి గ్రామాల్లో పిడుగులు పడి సుమారు 150 పశుసంపదను గిరిజనులు కోల్పోవడంతో సింహాచలం దేవస్థానానికి చెందిన గోశాల నుంచి ఆయా గిరిజనులకు పశువులు అందజేయాలని ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీ లిఖితపూర్వకంగా దేవస్థానం అధికారులను కోరారు. ఇటీవల జరిగిన దేవస్థానం ట్రస్టిబోర్డు సమావేశంలో ఆ విషయంపై తీర్మానం చేసి సభ్యులు ఆమోదించారు. దీంతో సోమవారం అధికారులు 138 వరకు గోవులు, గిత్తలు, కోడెదూడలను అందజేశారు. అల్లూరి జిల్లా డీఎస్పీ కె.వెంకటరావు, మాడుగుల సీఐ ఎ. సత్యనారాయణ, పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్, అల్లూరి జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ రాజారవికుమార్ సమక్షంలో దేవస్థానం అధికారులు అందజేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, పంచాడి పద్మ, దేవస్థానం గోశాల పర్యవేక్షకుడు హరి రాజు, ఏఈవో జంగం శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ పల్లి సూరిబాబు పాల్గొన్నారు.

తానాం గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



అప్పలనాయుడు . ప్రిన్సిపాల్

పరవాడ: తానాం బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం అర్హత కలిగిన విద్యార్థినులు ఏప్రిల్ 4 లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చునని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. బీసీ, ఈబీసీ విద్యార్థినుల వయసు 9 నుంచి 11 ఏళ్ల మధ్య .. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు 9 నుంచి 13 ఏళ్ల మించి ఉండకూడదని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం లక్ష రూపాయల లోపు ఉండి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వం గుర్తించిన పాఠశాలలో రెండేళ్లు చదివి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి https:// mjpapbcwreis, apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. నింపిన దరఖాస్తును జెరాక్స్ తీసుకోవాలన్నారు. పరీక్ష తేదికి వారం రోజుల ముందుగా అప్లికేషన్ నెంబరు ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు చెప్పారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



ఆశీర్వచనం స్వీకరిస్తున్న మహేశ్వరన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఓవర్సీస్ మేన్ పవర్ కార్పొరేషన్ ఎండీ సి.ఎన్.మహేశ్వరన్(ఐఏఎస్) దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ నాయుడు అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

ఆరిలోవ: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీప ప్రభుత్వ బాలికల గృహాన్ని సోమవారం కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులతో కలసి ఆయన సందర్శించారు. గృహంలో బాలికలకు కల్పిస్తున్న సౌకర్యాలతో పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ బాలికలతో అప్పారావు మాట్లాడారు. పదో తరగతి చదువుతున్న బాలికల పట్ల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని గృహం సూపరింటెండెంట్ సునీతకు సూచించారు. వారికి క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహాలు చేయకూడదన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యుడు సూర్యనారాయణ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు రాయగడ వాసి

ఎంవీపీ కాలనీ: మానసిక సమస్యల కారణంగా కుటుంబానికి దూరమైన ప్రియక నారిందు అనే వ్యక్తిని రెడ్‌క్రాస్ ప్రతినిధి మురళీ, తదితరులు ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒడిశాలోని రాయగడకు చెందిన ప్రియక నారిందు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం లేకపోవడంతో విశాఖ వచ్చేశాడు. మద్దిలపాలెంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆయన గురించి స్థానికులు 3వ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని రెడ్‌క్రాస్ ప్రతినిధులు సహకారంతో చికిత్స నిమిత్తం చినవాల్తేర్‌లోని మానసిక ఆస్పత్రికి తరలించారు. కొంత కాలంగా చికిత్స పొందుతున్న ఆయన నుంచి వైద్యులు వివరాలు సేకరించి రెడ్ క్రాస్ హోమ్ లెస్ షెల్టర్ ప్రతినిధి మురళీకి తెలియజేశారు. పోలీసుల ద్వారాఅతని తండ్రి మేనాప్రిబాకా, మేనమామ హుకాజయి విశాఖ చేరుకోగా ప్రియక నారిందును రెడ్ క్రాస్ ప్రతినిధుల అప్పగించారు.